ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.4, కనిష్ఠం 20.8

కామారెడ్డి జిల్లా వార్తలు

5

గురువారం 29 ఫిబ్రవరి 2024



1 నుంచి గృహజ్యోతి అమలు చేస్తాం : ఎస్ఈ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 28: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు తెల్ల రేషన్‌కార్డు ఉంటే 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు గృహజ్యోతి పథకం కింద మార్చి 1 నుంచి జీరో బిల్లులు అందించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ రమేష్‌బా బు తెలిపారు. ఎవరైతే గృహజ్యోతి పథకం పొందడానికి అర్హులై ఉండి లబ్ధి పొందకపోతే తమ పరిధిలోని ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవలన్నారు. అర్హత కలిగిన వారికి జీరో బిల్లులు అందిస్తామని తెలిపారు.







మార్కెట్ కమిటీ పదవులపై నజర్

కామారెడ్డి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల పదవులపై కాంగ్రెస్‌లోని పలువురు నేతలు దృష్టి సారించారు. పార్లమెంట్ ఎన్నికలలోపు మార్కెట్ కమిటీల నామినేట్ పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెలాఖరులోపు కమిటీలను నియమించేందుకు కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని పలు జిల్లాలో మార్కెట్ కమిటీల రిజర్వేషన్‌లను సైతం ఖరారు చేసింది. త్వరలోనే కామారెడ్డి జిల్లాలోని మార్కెట్ కమిటీల రిజర్వేషన్‌లను ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఇది వరకే జిల్లాలోని పది కమిటీల పాలకవర్గాలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లోని పలువురు నాయకులు ద్వితీయ శ్రేణి కార్యకర్తలు మార్కెట్ కమిటీల పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆశావహులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మంత్రుల చుట్టు ప్రదక్షణలు చేస్తున్నారు. మార్కెట్ కమిటీల పదవులకు తమ పేర్లను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో అన్ని మార్కెట్ కమిటీలకు నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు ప్రభుత్వం చేస్తున్న నేపథ్యంలో ఆశావహుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లాలో 10 మార్కెట్ కమిటీలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 10 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ పది మార్కెట్ కమిటీల పాలకవర్గాలను ఈనెల 12న కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది.

కాంగ్రెస్ తమ అనన్యులతో ఈ పాలకవర్గాలను భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టం ప్రకారం జిల్లాలోని కమిటీల రిజర్వేషన్‌లను ఖరారు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. గతంలో మార్కెట్ కమిటీల రిజర్వేషన్‌లు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మార్కెట్ కమిటీ రిజర్వేషన్ ఓసీ జనరల్‌కు కేటాయించగా, మద్నూర్ మార్కెట్ కమిటీకి ఓసీ జనరల్, బాన్సువాడ ఎస్సీ జనరల్, పిట్లం ఓసీ మహిళ, ఎల్లారెడ్డి ఓసీ జనరల్, గాంధారి ఓసీ జనరల్, భిక్నూర్ ఓసీ జనరల్, బీర్కూర్ ఓసీ జనరల్, బిచ్కుంద ఓసీ జనరల్, సదాశివనగర్ ఓసీ జనరల్ రిజర్వేషన్‌లు ఉండేవి. కొత్తగా రిజర్వేషన్‌లు చేయనున్న నేపథ్యంలో ఏ మార్కెట్ కమిటీకి ఏ రిజర్వేషన్ వస్తుందో చూడాలి.

- నామినేట్ పదవులను దక్కించుకునేందుకు కాంగ్రెస్ నేతల ప్రయత్నాలు
- పాలకవర్గాల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు
- కొత్త రిజర్వేషన్ల కోసం కసరత్తు ప్రారంభించిన ప్రభుత్వం
- నెలాఖరు లోపు కమిటీలను నియమించే అవకాశం
- ఇది వరకే జిల్లాలోని పది పాలకవర్గాల రద్దు

ఇవీ మార్గదర్శకాలు

తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశుగణన మార్కెట్ చట్టం 1906 సెక్షన్ 5(1) ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం మార్కెట్ కమిటీ ఏర్పాటు అవుతోంది. ఇందులో 12 మంది రైతులు ఉంటారు. మార్కెట్ కమిటీ పరిధిలో సన్నకారు రైతులు, ఇతర వ్యవసాయ ఉత్పత్తిదారుడు, పశుగణన ఉత్పత్తిదారులు (వీరిలో కనీసం ఐదుగురు సభ్యులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు, మహిళలు) ఉంటారు. కమిటీలో లైసెన్స్ పొందిన వ్యాపారులు ఇద్దరు, ఎక్స్ అఫీసియో సభ్యులు నలుగురు (వీరిలో మార్కెట్ పరిధిలో పీఎస్‌సీఎస్‌ల నుంచి ఒక సభ్యుడు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఒకరు, మార్కెట్ కమిటీ పరిధిలోని మున్సిపల్ చైర్‌పర్సన్ లేదా గ్రామ సర్పంచ్ ఒకరు) ఉండాలి. మార్కెట్ కమిటీ చైర్మన్‌ను 12 మంది రైతుల నుంచి ఒకరిని నియమిస్తారు. వైస్ చైర్మన్ లైసెన్స్ ట్రేడ్ సభ్యుల నుంచి లేదా రైతుల సభ్యుల నుంచి నియమించవచ్చు.

జోరుగా పైరవీలు

వ్యవసాయ మార్కెట్‌లకు త్వరలోనే నూతన పాలకవర్గాలు ఏర్పాటు చేస్తామని ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. గతంలో ఏడాది పాటు ఉండే పాలకవర్గ పదవి కాలాన్ని రెండేళ్లకు పెంచారు. తాజాగా ఆరు నెలలు రెండుసార్లు పదవి కాలాన్ని పెంచాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇప్పుడు వచ్చే పాలకవర్గ పదవికాలం మూడేళ్ల వరకు ఉండే అవకాశం ఉంది. జిల్లాలో 10 ప్రాంతాల్లో వ్యవసాయ మార్కెట్‌లు ఉన్నాయి. జిల్లాలో రిజర్వేషన్‌లు ఖరారు అయిన తర్వాత అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులు పదవుల కోసం ఇప్పటి నుంచే జోరుగా పైరవీలు మొదలుపెట్టారు.

కోడ్ వస్తే ఎన్నికల తర్వాతే..

మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను ప్రభుత్వం త్వరగా నియమిస్తే ఈ నెలాఖరులోపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు మార్కెట్ కమిటీల నియామక విషయాల్లో త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే ప్రక్రియ మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలై కోడ్ అమలులోకి వస్తే కమిటీల నియామకం ఇప్పట్లో ఉండదు. ఎన్నికల తర్వాత కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తదుపరి మే, జూన్ నెలలో కొత్త పాలకవర్గాలను నియమించుకోవాల్సి ఉంటుంది.

హైకోర్టు స్టేతో నాగిరెడ్డిపేట

మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక రద్దు



నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక కోసం ఏర్పాట్లు చేసిన అధికారులు

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 28: నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణపై హైకోర్టు స్టే ఇవ్వడంతో ఈనెల 28వ తేదీన బుధవారం ఉదయం 11 గంటలకు నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరగాల్సిన ఉన్న మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక రద్దు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరస్వామి తెలిపారు. మండలంలోని ధర్మారెడ్డి ఎంపీటీసీ స్థానం ఖాళీగా ఉన్నందున, ఖాళీగా ఉన్న ఎంపీటీసీ స్థానానికి ఎన్నికలు జరగనందున హైకోర్టు స్టే ఇచ్చినట్లు రిటర్నింగ్ అధికారి వీరస్వామి తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగాల్సి ఉండటంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లు అన్ని పూర్తి చేశారు. కాగా ప్రస్తుతం నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న దీవిటి రాజ్‌దాస్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహణపై హైకో ర్టును ఆశ్రయించారు. దీంతో బుధవారం జరగాల్సిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించవద్దంటూ మంగళవారం హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు స్టే ఇవ్వడంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం జరగాల్సిన మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడి ఎన్నికను అధికారులు రద్దు చేశారు.

జనరల్ మహిళా రిజర్వేషన్ స్థానంలో నాలుగున్నరేళ్లుగా రాజ్‌దాస్

2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్ష స్థానాన్ని జనరల్ మహిళకు రిజర్వు చేశారు. మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అప్పట్లో జరిగిన ఎన్నికల్లో ఐదు స్థానాల ను కాంగ్రెస్ పార్టీ, రెండు స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీ మూడు స్థానాల్లో ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలుపొందారు. మండల ప్రజా పరిషత్ వైస్ ఎంపీపీకి జరిగిన ఎన్నికల్లో తాండూర్ ఎంపీటీసీ స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన దీవిటి రాజ్‌దాస్ టాస్ ద్వారా వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో పోచారం ఎంపీటీసీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన టేకులపల్లి వినీత అధ్యక్ష పదవికి పోటీ చేయగా, ఆమె ప్రత్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి ధర్మారెడ్డి ఎంపీటీసీగా గెలిచిన కృష్ణవేణి కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా అధ్యక్ష పదవి కోసం పోటీ చేశారు. దీంతో టేకులపల్లి వినీతకు, కృష్ణవేణికి ఇద్దరికి సరి సమానంగా ఐదు, ఐదు ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు టాస్ పద్ధతిని పాటిం చారు. టాస్‌లో కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థి కృష్ణవేణికి అదృష్టం వరించింది. ఆమె టాస్‌లో విజయం సాధించి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా ఎంపికయ్యారు. అయితే కృష్ణవేణి పార్టీ విప్‌ను ధిక్కరించిందంటూ కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెపై ఎన్నికల అధికారులు అనర్హత వేటు వేశారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన దీవి రాజ్‌దా స్‌ను మండల ప్రజాపరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా ఉన్నతాధికారులు బాధ్యతలను అప్పగించారు. దీంతో సుమారు నాలుగున్నరేళ్లుగా ఆయన ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్నారు. ఎన్నికలు జరిగిన కొన్ని నెలలకే ధర్మారెడ్డి ఎంపీటీసీ కృష్ణవేణి అనారోగ్యం కారణంగా మృతి చెందింది. కృష్ణవేణి మృతితో ఖాళీ అయిన ధర్మారెడ్డి ఎంపీటీసీ స్థానానికి ఇప్పటి వరకు ఎన్నికలు జరగలేవు.

హైకోర్టు స్టేతో రెండు సార్లు పదవిని కాపాడుకున్న రాజ్‌దాస్



దివిటి రాజ్‌దాస్ ఇన్‌చార్జి ఎంపీపీ

నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న దివిటి రాజ్‌దాస్ హైకోర్టు స్టే వల్ల రెండుసార్లు తన పదవిని కాపాడుకున్నారు. మండలంలో ప్రస్తుతం 9 మంది ఎంపీటీసీలు ఉండగా, అందులో 8 మంది ఎంపీటీసీలు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఉన్నారు. వైస్ ఎంపీపీగా గెలిచి, ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగుతున్న రాజ్‌దాస్‌ను పదవి నుంచి దించేయాలనే లక్ష్యంతో మండలం లోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది ఎంపీటీసీలు గత సంవత్సరం 2023 జూలై 7న రాజ్‌దాస్‌పై వైస్ ఎంపీపీ నుంచి తొలగించేందుకు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఎంపీటీసీలు ఎల్లారె డ్డి ఆర్డీవోకు అవిశ్వాసం నోటీసులు ఇచ్చారు. బల పరీక్ష కోసం 2023 ఆగస్టు 2వ తేదిన నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిం చాల్సి ఉండగా తనపై ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాసంపై రాజ్‌దాస్ హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు అవిశ్వాస తీర్మానంపై స్టే ఇచ్చింది. దీంతో ఆయన అప్పట్లో తన పదవిని కాపాడుకున్నారు. తాజాగా ఎంపీపీ అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఈనెల 28న ఉదయం 11 గంటలకు నాగిరెడ్డిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఇంచార్జి ఎంపీపీగా కొనసాగుతున్న రాజ్‌దాస్ మరోమారు హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు స్టే ఇచ్చింది. దీంతో బుధవారం జరగాల్సిన మండ ల ప్రజా పరిషత్ అధ్యక్షుని ఎన్నిక లను అధికారులు రద్దు చేశారు. దీంతో హైకోర్టు స్టే ఉత్తర్వుల ద్వారా రాజ్‌దాస్ రెండోసారి తన పదవిని కాపాడు కోగలిగారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 28: జిల్లాలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి రోజు తెలుగు, సంస్కృతం, ఉర్దూ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లాలో 9,750 మంది హాజరు కావలసి ఉండగా 9,329 మంది విద్యార్థులు హాజరయ్యారు. 421 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8.30 గంటలలోపే పరీక్ష కేంద్రాలకు చేరాలని సూచించడంతో విద్యార్థులు హైరానా పడుతూ పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. నిర్ణీత సమయానికి నిమిషం ఆలస్యమైనా లోనికి అనుమతి ఉండదని ఇంటర్ మీడియట్ అధికారులు చెప్పడంతో పెద్ద మొత్తంలోనే విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా మండలాల్లో కొందరు విద్యార్థులు సమయానికి చేరుకోలేదని తెలుస్తోంది.



కామారెడ్డిలో పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్



హాల్ టికెట్ నెంబర్లను బోర్డుపై చూసుకుంటున్న విద్యార్థులు

నిబంధనలు తూచ్

జిల్లా కేంద్రంలో పరీక్షా సమయంలో అంతటా జిరాక్స్ సెంటర్‌లు యథేచ్ఛగా తెరిచి ఉంచారు. జన్మభూమి రోడ్డు, నిజాంసాగర్ రోడ్డు వద్ద గల సెంటర్‌లకు 100 మీటర్ల దూరంలోనే జిరాక్స్ సెంటర్‌లు తెరిచి ఉంచిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూసిన దాఖలాలు లేవు. ఇంటర్మీడియట్ అధికారులు, జిల్లా కలెక్టర్ పరీక్షలపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని పకడ్బందీ చర్యలు చేపట్టాలని పలుమార్లు సమావేశాలు నిర్వహించి అధికారులకు సూచించిన జిల్లా అధికారులు మాత్రం పెడచెవిన పెట్టడం వల్ల పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్‌లు తెరిచే ఉన్నాయి. ప్రతీ ఏడాది ఇదే తంతు కొనసాగుతున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. గతంలో పేపర్ లీకేజీలతో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం లేచినా అధికారులు మాత్రం వారి పంతాను మార్చుకోకపోవడం గమనార్హం.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ ఆర్యభట్ట, రామారెడ్డి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలలో కల్పించిన వసతుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సాందీపని కళాశాలను ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం సందర్శించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

నేర విచారణ సమర్థవంతంగా చేయాలి

ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 28: నేర విచారణ మరింత సమర్థవంతంగా చేయడంతో పాటు ప్రతీ కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని కేసులను సత్వరం పరిష్కరించే విధంగా పోలీసు అధికారులంతా పని చేయాలని ఎస్పీ సింధూశర్మ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోక్సోయాక్ట్ కేసుల్లో విచారణ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో మిస్సింగైన మహిళలు, చిన్నపిల్లల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని ట్రేస్ చేయాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలైన గుట్కా రవాణా, గంజాయి, పేకాట, అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, అక్రమ మార్గాల ద్వారా అధిక వడ్డీలు వసూలు చేస్తూ అమాయక ప్రజలను పీడిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేర స్వభావం కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏ విధమైన చర్యలను తీసుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయో అధికారులతో చర్చించారు. ప్రతీ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు నిర్వహించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రాంతాలపై నిఘా ఉంచాలని వారిపై కేసులు నమోదు చేయాలని అన్నారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనభరిచిన వారికి అవార్డులు అందించారు. అదేవిధంగా జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటి క్స్ పోటీల్లో జిల్లా రిజర్వు సబ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్‌కు బంగారు పతకం రావడంతో ఆయనను అభినందించారు. గత డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని మొదటి బహుమతి బంగారు పతకం సాధించాడని మే నెలలో శ్రీలంకలో జరగబోయే అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు దేశం తరపున పాల్గొనడానికి ఎంపిక కావడం జిల్లా, రాష్ట్ర పోలీసుశాఖకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణ, మదన్‌లాల్, ఎస్బీ ఇన్స్‌పెక్టర్ జార్జ్, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ రవీందర్, ఆర్ఐలు కృష్ణ, సుభాష్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చంద్రశేఖర్‌గౌడ్‌ను అభినందిస్తున్న ఎస్పీ సింధూశర్మ

నేడు సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని పరిశీలించనున్న బీజేపీ నేతలు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: రూరల్ పరిధిలోని సారంగపూర్‌లోని ఎన్‌సీఎఫ్ఎస్ ఫ్యాక్టరీని బీజేపీ నేతలు నేడు పరిశీలించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు బీజేపీ నేతలు ఫ్యాక్టరీకి రానున్నారు. చక్కెర ఫ్యాక్టరీలోని మిషనరీ, యంత్ర పరికరాలు, ఫ్యాక్టరీ పరిసరాలు, ఫ్యాక్టరీకి సంబంధించిన భూములు పరిశీలించనున్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణను తీసుకోవాల్సిన చర్యల గురించి, ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులు, ఉద్యోగులు, సిబ్బంది, చెరుకు రైతులతో మాట్లాడనున్నట్లు బీజేపీ రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.

ఎంఎడ్ 3వ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంఎడ్ రెగ్యులర్ 3వ సెమిస్టర్ పరీక్షలు రెండో రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 36మంది విద్యార్థులకు గాను 35మంది పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాకు వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు



మాట్లాడుతున్న పరిశోధక విద్యార్థి సంఘ నాయకులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 28: నిజామాబాద్ జిల్లాకు వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం తెలంగాణ యూనివర్సిటీలో, టీయూ పరిశోధక విద్యార్థి సంఘం, మరియు ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పరిశోధక విద్యార్థి సంఘంఅధ్యక్షుడు పుప్పల రవి మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా విద్యార్థులకు వ్యవసాయ డిగ్రీ కళాశాల దశాబ్దాల కల అని మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, లకు సహకరించిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే భూపతిరెడ్డి లకు ధన్యవాదలు తెలిపారు. జిల్లాలో ఈ యూనివర్సిటీ ఏర్పాటుతో ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత చదువు దక్కుతుందని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో వర్సిటీ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు కొమిరే శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి రాజేందర్, తెలంగాణ ఉద్యమకారులు లక్ష్మణ్, వినయ్, ఉన్నారు.

బండి సంజయ్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తున్నాం

● నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



పెద్దబజార్, ఫిబ్రవరి 28:బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కాన్వాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో మాజీ ప్రదాని పీవీనర్సింహారావు ఇంటిని సందర్శించి ముల్కనూరుకు బయలుదేరుతుండగా పొన్నం ప్రభాకర్ అనుచరులు కోడిగుడ్లతో కాన్వాయ్ పైన దాడి చేయడం సరైందికాదన్నారు. బండి సంజయ్ ప్రజాహిత యాత్రలో భాగంగా ముల్కనూరుకు వెళ్తుండగా పొన్నం ప్రభాకర్ అనుచరులు కాన్వాయ్‌పై దాడి చేయడం, నీచమైన పనులు చేయించడం సరైందికాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోదీ చరిష్మా తట్టుకోలేక బీజేపీ ఎదుగుదలను ఓర్వలేక పిరికిపంద చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు. పొన్నం ప్రభాకర్‌కు దమ్ముంటే బండి సంజయ్‌పైన ఎంపీగా పోటీ చేసి గెలవాలని అన్నారు. పోలీసుల సమక్షంలో ఈ దాడి జరగడం పోలీసుల గులంగిరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.







భీమ్‌గల్ మున్సిపాలిటీలో మొదలైన రచ్చ

● రాధం చెరువు సర్వే పూర్తి, కందకం పనులు షురూ ● సర్వేప్రకారం కందకం పనులు కొనసాగిస్తున్న రెవెన్యూ అధికారులు ● రాధం చెరువు శిఖం భూమిలో అక్రమ గృహనిర్మాణాలు, వెంచర్లు


రాధం చెరువుచుట్టూ అక్రమంగా వెలిసిన గృహనిర్మాణాలు


చెరువు శిఖం భూమిలో హద్దులను గుర్తిస్తూ కందకం తవ్వుతున్న రెవెన్యూ శాఖ అధికారులు


రాధం చెరువులో అక్రమంగా వెలిసిన వెంచర్‌లో నూతన గృహనిర్మాణాలు

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి 28: భీమ్‌గల్ మున్సిపాలిటీలో గత కొన్ని రోజులుగా రెవెన్యూ అధికారులు రెవెన్యూ జిల్లా స్థాయి అధికారుల జాయింట్ సర్వేలో భాగంగా ఆక్రమణకు గురైన రాధం చెరువు, మొగిలిచెరువు, ధర్మారాయుడు కుంట, బడిచెరి కుంటల సర్వే పనులు కొనసాగుతున్నాయి.. సర్వేలో భాగంగా రాధంచెరువు సర్వే నెంబరు 27లో 73 ఎకరాల సర్వే పూర్తి అయ్యింది. గత వారం రోజుల నుంచి రాధం చెరువు శిఖం భూమిలో హద్దుల ప్రకారం కందకాలను తవ్వడం మొదలుపెట్టారు రెవెన్యూ అధికారులు..కందకం తవ్వకాల్లో అధికారులకు ఎన్నో రకాల అడ్డంకులు ఎదురవుతున్నాయి. కందకం పనులు పూర్తి స్థాయిలో కొనసాగిస్తారా, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తప్పుల తడక కందకాల పనులు ముగించేస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది..

● కందకానికి అడ్డంగా గృహనిర్మాణాలు

రాధం చెరువు భూమి సర్వే ప్రకారం హద్దులను కేటాయిస్తూ కందకాలను జేసీబీ సహాయంతో తవ్వుతున్నారు. మొదటగా సుభాష్ నగర్ వద్ద ఉన్న చెరువు ముఖద్వారం నుంచి కందకం పనులను ప్రారంభించారు అధికారులు. కందకం పనులు కొనసాగుతున్న క్రమంలో కందకానికి అడ్డంగా చెరువు భూమిలో అక్రమంగా వెలిసిన గృహనిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. కందకానికి ఎక్కడైతే అడ్డుగా వస్తున్న గృహాలను విడిచిపెడుతూ ముందుకు కందకాలను తవ్వుతున్నారు. మరికొన్నిచోట్ల కందకాలకు చెరువునీరు వుండడంతో ఆలస్యమవుతోంది. రాధం చెరువును ఆనుకొని ఇటీవల కొత్తగా వెంచర్ వెలిసింది. వెంచర్‌కు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని వెంచర్ యజమానులు వెంచర్ చుట్టూ ప్రహరీ గోడను నిర్మించి వెంచర్ లోని ప్లాట్‌లను పూర్తిగా అమ్మివేశారు. ఇట్టి వెంచర్‌లో కొంతమంది ప్లాటు యజమానులు గృహనిర్మాణాలు చేపడుతున్నారు. నూతన గృహనిర్మాణాల పనులు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో ఏకంగా వెంచర్‌లోని సగంభూమి చెరువు శిఖం భూమిగా గుర్తించి కందకాన్ని తవ్వారు. లక్షల రూపాయలు గుమ్మరించి తమ కష్టార్జీతంతో ఒక్క ప్లాటు కొనుగోలు చేస్తే అదికాస్త చెరువు భూమిలో ఉందని అధికారులు ట్రెంచ్ కొట్టారని వాపోతున్నారు. వెంచర్ యజమానులు వెంచర్‌కు సంబంధించి నాలా, డీటీసీపీ లే అవుట్‌తో కూడిన అన్ని రకాల అనుమతులు ఉన్నాయని ప్లాట్‌లను అమ్మారని బాధితులు వాపోతున్నారు. మరికొందరు ఏకంగా గృహనిర్మాణాలు చేపడుతున్నారు. మరికొందరు అక్రమంగా చెరువు భూమిని కబ్జాచేసి దర్జాగా మున్సిపాలిటీ అనుమతులు పొంది గృహనిర్మాణాలు చేపట్టారు. చెరువు శిఖం భూమిలో పుట్టగొడుగుల్లా అక్రమ సర్వే నెంబర్‌లతో సబ్ రిజిష్టార్ కార్యాలయంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. వీరికి అనుమతులు ఎవరు ఇచ్చారు. అనే సందేహాలు ప్రస్తుతం భీమ్‌గల్ మున్సిపాలిటీలో హాట్‌టాపిక్‌గా మారింది. అక్రమంగా వెలిసిని గృహనిర్మాణాలు వుంటాయా?, నిబంధనల ప్రకారం అక్రమంగా వెలిసిన ప్లాట్‌లను, గృహనిర్మాణాలను తొలగిస్తారా? అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

రాధం చెరువు కందకం పనులు కొనసాగుతున్నాయి



భీమ్‌గల్ పట్టణంలోని ప్రధాన చెరువుల సర్వే కొనసాగుతోంది. అందులో రాధం చెరువు సర్వే పూర్తి అయ్యింది. కందకం పనులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తికాగానే పై అధికారులకు నివేదికలు అంది స్తాం. రాధం చెరువు కబ్జాకు గురైందా? లేదా అన్నది భీమ్‌గల్ మున్సిపాలిటీ అధికారుల జాయింట్ సర్వేతో తెలుస్తోంది.

- శ్రీలత, తహసీల్దార్, భీమ్‌గల్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

రుద్రూరు, ఫిబ్రవరి 28 : రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆరు గ్యారెంటీలలో మరో రెండు గ్యారెంటీలైన 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను ప్రారంభించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు టపాసులను పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరి చంద్రశేఖర్, రుద్రూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, నాయకులు నడిపింటి నగేష్, పట్ల సురేష్, అనిల్ పటేల్, గౌస్, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మోస్రా: మోస్రా మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తిమీర్‌కర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏదైనా వాగ్ధానం చేస్తే కచ్చితంగా అమలు చేస్తోందని అందులో భాగంగా రూ.200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తోందని తెలిపారు ఈ కార్యక్రమంలో మోస్రా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సైనిపురం నర్సారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, సీనియర్ నాయకులు హరి నారాయణ, మండల ఉపాధ్యక్షుడు ఎంటికల శంకర్, తిమ్మాపూర్ పార్టీ అధ్యక్షుడు గజ్జి నారాయణ, గోపూరు పార్టీ అధ్యక్షుడు గంగారాం, ఓబీసీ జిల్లా సెక్రటరీ అశోక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సాయిలు, జలీల్, వినాయక్, వీరన్న, శ్రీధర్, చింతకుంట పోతారెడ్డి, దోమల శ్రీనివాస్, అఫ్రోజ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

వర్ని: 500రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తేవడంతో బుధవారం మండల కేంద్రంలో మహిళలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. జై కాంగ్రెస్ నినాదాలతో హోరెత్తించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ, రాజ్యం కల సాకారం అయిందని జడ్పీటీసీ అంబర్ సింగ్, వైస్ ఎంపీపీ దశగౌడ్, నాయకులు రాం రెడ్డి, పోత రాజు శ్రీనులు హర్షం వ్యక్తం చేశారు.


సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

● ఎంపీపీ ఆధ్వర్యంలో సంబరాలు

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలును హర్షిస్తూ బుధవారం వర్ని మండల కేంద్రంలో ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు ఆధ్వర్యంలో సంబరాలు చేశారు. సీఎం, ఉప ముఖ్యమంత్రి, సోనియా, రాహుల్ గాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ దశరథ్, మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ బాబా, డీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, లక్ష్మణ్, గంగప్ప. రాంరెడ్డి, భీమ, శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.


పొతంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల్లో గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు పథకాలను అమలు చేయడం పట్ల హర్షిస్తూ సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎన్ని ఇబ్బందులు వచ్చిన అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి మండల నాయకులు మనోహర్, షహీద్, శ్రీనివాస్ రావు, గంగాధర్ దేశాయ్, శివరాజ్ దేశాయ్, పొతంగల్‌లో హెగ్డోలి శంకర్, వీరేశం, రామిరెడ్డి, ధన్‌రాజ్, రాజు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి అన్నదమ్ముల మృతి

పిట్లం,ఫిబ్రవరి28: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పిట్లం - మద్దెల్ చెరువు ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారు జామున బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో సవాయి సింగ్ (45), కిషన్(36) అన్నదమ్ములు మృతి చెందారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండలంలోని సిద్దాపూర్ తండాకు చెందిన సవాయి సింగ్, కిషన్, కిషన్ కుమారుడు కార్తిక్ ముగ్గురు పిట్లం మండలంలోని రూం తండాలో సుభాష్ చెల్లెలి పెళ్లి జరిగింది. వివాహ కార్యక్రమానికి హాజరై బుధవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో సుభాష్, ముగ్గురుని ఒకే ద్విచక్ర వాహనంపై తీసుకెళుతున్నాడు. కాగా పిట్లం - మద్దెల్ చెరువు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొని నలుగురు కింద పడ్డారు. సవాయి సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై వెళుతున్న స్థానికులు గమనించి కిషన్‌ను బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుభాష్‌కు గాయాలు కావడంతో నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కార్తిక్‌కు చిన్న పాటి గాయాలు అయ్యాయి. సవాయి సింగ్ తమ్ముడు దేవీ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. అతి వేగం, ఒకే బైక్‌పై నలుగురు వెళ్లడంతోనే ప్రమాదం జరిగిందని ఆయన తెలిపారు.

ఏడాది కుమారున్ని రోడ్డుపై వదిలి..

● ప్రధాన కాల్వ వద్ద అదృశ్యమైన కన్న తల్లి

● నీటిలో దూకిందనే అనుమానంతో గాలింపు చర్యలు


అందోల్ శిరీష(ఫైల్)

నిజాంసాగర్(మహ్మద్‌నగర్), ఫిబ్రవరి 28: ఎల్లారెడ్డి మండలం లోని గండిమాసాని పేట్ గ్రామానికి చెందిన అందోల్ శిరీష అలి యాస్ పద్మ (25) అనే వివాహిత మహ్మద్‌నగర్ మండలంలోని గాలిపూర్ గేటు సమీపంలో గల 10వ నెంబర్ డిస్ట్రిబ్యూటరీ సమీ పంలోని ప్రధాన కాల్వ వద్ద తన ఏడాది కుమారుడిని రోడ్డుపై వదిలి అదృశ్యమైనట్లు శిరీష సోదరుడు శివ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం. బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన లక్ష్మీ కుమార్తెను 3 సంవత్సరాల క్రితం ఎల్లారెడ్డి మండలం గండి మాసాని పేట్‌కు చెందిన అందోల్ సతీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి సంవత్సరం బాబు యోగేష్ ఉన్నాడు. ఈ నెల 17వ తేదిన బాబు పుట్టిన రోజు వేడుకలు సైతం ఘనంగా నిర్వహించారు. బుధవారం గండి మాసానిపేట్ నుంచి శిరీష కాళ్లకు మెట్టెలు చేయించుకునేందుకు తల్లిగారి పిలుపుతో తాడ్కోల్‌కు బయలుదేరి వెళ్లారు. అయితే బుధవారం ఉదయం భర్త ఎల్లారెడ్డిలో బస్సు ఎక్కించి ఇంటికి వెళ్లిపో యాడు. తన ఏడాది కుమారుడిని రోడ్డుపై వదిలి అదృశ్యమైంది. రోడ్డు పై సంవత్సరం బాబు ఏడుస్తూ కనిపించడంతో అటుగా వెళు తున్న ప్రయాణికులు ఓద్విచక్ర వాహనదారుడు, స్థానికులు బాబును గుర్తించి అక్కున చేర్చుకున్నారు. ఒడ్డున చెప్పులు, బాగు ఉంది. బ్యాగును తనిఖీ చేయగా, శిరీష ఆధార్ కార్డు కనిపించడంతో స్థానికులు 100కు ఫోన్ చేశారు. దీంతో నిజాంసాగర్ పోలీసులు సంఘ టన స్థలానికి చేరుకుని బాబును నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చా రు. అనంతరం శిరీష కుటుంబీకులు నిజాంసాగర్‌కు చేరుకోవడంతో వారి కుటుంబీకులకు బాబును అప్పగించారు. శిరీష తల్లి రోదిస్తూ తన బిడ్డ ప్రధాన కాల్వలో పడి మృతిచెందిందని, అల్లుడి వేధింపుల వల్లే తన బిడ్డ తనకు కాకుండా పోయిందంటూ రోదించసాగడంతో స్థానికులు సైతం కంట తడి పెట్టారు. నిజాం సాగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నీటి పారుదల శాఖ అధికా రులకు సమాచారం అందించారు. దీంతో నిజాంసాగర్ ప్రధాన కాల్వ ద్వారా కొనసాగుతున్న నీటి విడుదలను నిలిపివేశారు. నీటి ఉధృతి తగ్గిన తర్వాత గాలింపు చర్యలు ముమ్మరంచేయనున్నారు.

పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం

● పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28: పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, బోధన్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రజలు పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మున్సిపల్ సమావేశ మందిరంలో 2024-25 బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణ అభివృద్ధికి 23 కోట్ల 50 లక్షలతో ప్రణాళిక రూపొందించామన్నారు. త్వరలో పట్టణ అభివృద్ధికి నిధులు రానున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారంతో తెలంగాణలో బోధన్ మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

మారంపల్లి సబ్‌సెంటర్ తనిఖీ

డొంకేశ్వర్, ఫిబ్రవరి28: డొంకేశ్వర్ మండలంలోని మారంపల్లి గ్రామంలో సబ్‌సెంటర్‌ను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ తనిఖీ చేశారు. టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. 3వ తేదీ నిర్వహించే పల్స్ పోలియో సిబ్బందికి పలు సూచనలు చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పిల్లలకు తప్పకుండా పోలియో వేసే విధంగా చూడాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. గ్రామంలో నూతన సబ్‌సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేందర్, ఎంఎల్‌హెచ్‌సీ సతీష్, ఎఎన్‌ఎం షైముద్‌బేగం, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

పెర్కిట్, ఫిబ్రవరి28: ప్రపంచ టైలర్స్ డే పురస్కరించుకొని బుధవారం ఆర్మూర్ పట్టణంలో మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మేరు సంఘం నుంచి పాతబస్టాండ్, జెండగల్లి, పెర్కిట్, మామిడిపల్లి, నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మేరుకులస్థులు కుట్టుమిషన్‌లతో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ఆర్డీవో కార్యాలయంలో మేరు కులస్థుల సమస్యలపై మెమో రాండం అందజేశారు. అనంతరం మేరు సంఘంలో పలువురు సీనియర్ మేరు కులవృత్తిదారులకు పట్టుశాలువ పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రవినాథ్, సెక్రెటరీ లక్ష్మణ్, కోశాధికారి గంగాధర్, కొట్టూరు వినోద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మేర సంఘ సభ్యులు

జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు


విజ్ఞాన్‌లో ప్రదర్శనను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్అర్బన్,ఫిబ్రవరి28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు పాఠశాలలో బుధవారం సైన్స్ ప్రదర్శనలను నిర్వహించారు. నగరంలోని ఎస్ఆర్ డీజీ, ఎస్ఆర్ ప్రైమ్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. 5వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులు వివిధ ప్రదర్శనలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈ ప్రదర్శనలను ఎస్ఆర్ పాఠశాలల చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్‌కుమార్, జోనల్ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్, ప్రిన్సిపల్ తిలకించి విద్యార్థులను అభినందించారు.

● విజ్ఞాన్‌లో ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శన

నగరంలోని ఓల్డ్ ఎన్‌జీవోస్ కాలనీలోగల విజ్ఞాన్ హైస్కూల్‌లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబీషన్ ఆకట్టుకుంది. పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబీషన్‌ను ట్రస్మా ప్రతినిధి నర్సింహారావు, మోహన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన త్రీడీ ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు వివిధ విభిన్నమైన ప్రాజెక్టులను రూపొందించగా వాటి వివరాలు తెలుసుకొని వారిని అభినందించారు.

డొంకేశ్వర్: విద్యార్థి దశ నుంచి సైన్స్ కార్యక్రమాలు విద్యార్థులకు నేర్పించాలని రాబోయే రోజుల్లో సైంటిస్టులుగా ఎదగుతారని ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం డొంకేశ్వర్ మండలంలోని ప్రభుత్వ పాఠ శాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం సురేష్‌కుమార్,వెంకటరమణచారి పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని తొర్తి గ్రామంలోని ఉన్నత పాఠశాలకు పీపుల్స్ వారియర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. బుధవారం విద్యార్థులకు సైన్స్ ఉపకరణాలను పంపిణీ చేశారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని జెంటిల్‌కిడ్స్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో రాజగంగారాం పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామకృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

నందిపేట: మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బుధవారం నేషనల్ సైన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు అనేక వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. నోడల్ అధికారి తమ్మిరెడ్డి విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించి అభినందించారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్‌రావు,లక్ష్మీనర్సయ్య, నర్సింహస్వామి, సుమలత, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం లోని పలుప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

ధర్పల్లి: సైన్స్ నిత్య జీవితంలో ఒక భాగమని సైన్స్‌తోనే సర్వమానవాళి మనుగడ కొనసాగుతుందని లిటిల్ హార్ట్స్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం పాఠశాలలో సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సాధన, విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిన్, పాఠశాల హెచ్ఎం, టీచర్లు తదితరులున్నారు.

మోస్రా: మండలంలోని చింతకుంట గ్రామంలో నలంద విద్యానిలయంలో జాతీయసైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శన చూసి ఉపాధ్యాయుల బృందం ప్రశంసించారు.


కౌన్సిలర్ ఇంటి ముందు గుమిగూడిన జనం

బాన్సువాడ మున్సిపల్ కౌన్సిలర్ ఇంటి వద్ద ఉద్రిక్తత

బాన్సువాడ, ఫిబ్రవరి 28 : బీఆర్ఎస్‌లో నుంచి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న 10వ వార్డు కౌన్సిలర్ రమాదేవి ఇంటి వద్ద బుధవారం ఉద్రిక్తత నెలకొంది. కౌన్సిలర్‌ను బుజ్జగించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారన్న సమాచారంతో కాంగ్రెస్ నాయకులు కూడా ఆమె ఇంటికి చేరుకున్నారు. సుమారు గంట పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఈ క్రమంలో అక్కడ కొంత గందరగోళం నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మీ సేవ నిర్వాహకులు

మీ సేవ కేంద్రాలకు మినహాయింపు ఇవ్వాలి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కావడంతో పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలను బంద్ నుంచి మినహాయింపు ఇవ్వాలని బుధవారం ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్‌కుమార్‌కు మీ సేవ నిర్వాహకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ సేవ కేంద్రాలు బంద్ ఉంచడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పండరి, సతీష్ ఉన్నారు.

అంకోల్‌లో గావ్ చలో అభియాన్

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 28: మండలంలోని అంకోల్, సంగం గ్రామాల్లో బుధవారం బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు గ్రామ గ్రామాన ప్రజలకు వివరించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సున్నం సాయిలు, ప్రధాన కార్యదర్శి మేకల రామన్న యాదవ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

రాజంపేటలో పంటల పరిశీలన

రాజంపేట, ఫిబ్రవరి 28: రాజంపేట మండలంలోని ఆర్గొండ, కొండాపూర్, సిద్దాపూర్ గ్రామాల్లో బుధవారం పంటలను ఏవో సుప్రజ్యోతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, శనగ, కూరగాయ పంటలను ప్రధానంగా సాగు చేస్తున్నారని వరి పంటలో మోగి పురుగును గమనించినట్లు తెలిపారు. మోగిపురుగు నివారణకు ఒక ఎకరానికి 8 నుంచి 10 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు 7 నుంచి 8 కిలోల ఇసుకలో కలిపి సాయంత్రం వేళలో చల్లు కోవాలని తెలిపారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండే కార్టప్ హైడ్రోక్లోరైడ్ అనే మందును 2 గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పొలం అంతా సమానంగా పిచికారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

రామారెడ్డి, ఫిబ్రవరి 26: రామారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన ఒంటరి నవీన్‌రెడ్డి(23) అనే యువకుడు మంగళవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ కొండ విజయ్ తెలిపారు. మృతుడి తండ్రి భూపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కంటి శిబిరాన్ని ఉపయోగించుకోవాలి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని హైదరాబాద్ మెడివిజన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు విఠల్‌రావు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న విశ్రాంత ఉద్యోగులు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. పెన్షన్ ఐడీకార్డు, హెల్త్‌కార్డు, ఆధార్ కార్డులను ఉదయం 11 గంటలకు వెంట వచ్చేటప్పుడు తీసుకుని రావాలని కోరారు.

తిమ్మాపూర్‌లో సెక్టార్ సమావేశం

బీర్కూర్, ఫిబ్రవరి 28 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్ల మండల సెక్టార్ సమావేశం నిర్వహించారు. నెలవారీ నివేదికలపై బాన్సువాడ ఐసీడీఎస్ సీడీపీవో కళావతి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు సుమలత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 28 : పట్టణంలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ ఉపకరణాలతో ప్రయోగాలు చేసి ప్రదర్శించారు. పట్టణంలోని సింధు విద్యాలయంలో విద్యార్థులు చేసిన ప్రయోగాలను మండల విద్యాధికారి నాగేశ్వరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత వెలికితీసేందుకు ప్రయోగాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగన్, పాఠశాల సిబ్బంది తదితరులున్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని వెంకట సాయి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు నేషనల్ సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్స్ డే సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు క్విజ్ పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్, స్కిట్, డ్రాయింగ్ నిర్వహించడం జరిగిందన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు ఏర్పాటు చేసిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలను ఉపాధ్యాయులు పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ సైన్స్ అనేది ఒక శాస్త్రీయ విద్య అని, మన జీవితాన్ని సుఖవంతం చేయడానికి వ్యవసాయం, ఆరోగ్యం వంటి రంగాల్లో పురోగతి సాధించడానికి సైన్స్ ఉపయోగపడుతుందని తెలిపారు.

మద్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నోబెల్ అవార్డు గ్రహీత సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని వాసవి హైస్కూల్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మైథిలి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాకాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండల కేంద్రంలోని బ్లూబెల్స్ పాఠశాలలో విద్యార్థులు రకరకాల ప్రయోగాలు తయారు చేసి వారి తల్లి తండ్రులకు వాటి ప్రాముఖ్యతను వివరించారు. మండల విద్యాశాఖ అధికారి దేవీసింగ్ సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: మండల కేంద్రంలోని టీఎస్ఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, జ్యోతిబాపూలే, కస్తూర్బా, సంస్కార్ తదితర పాఠశాలల్లో సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ ప్రయోగాలను నిర్వహించారు. సోలార్‌సిస్టమ్, అంతరిక్షంలోకి రాకెట్‌పంపే విధానం, రక్తప్రసరణ వంటి ప్రయోగాలు నిర్వహించారు.


బాన్సువాడలో ప్రయోగాలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి

సదాశివనగర్: ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు చేసిన సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రాజేందర్, అరవింద్, ఉపాధ్యాయులు రాజశేఖర్, చిత్ర, నీరజ, దశరథ్, రమేష్, విద్యా రమణ, జిజియా, సౌందర్య, వీణ,నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


బీర్కూర్‌లో..


మద్నూర్‌లో..



పిట్లంలో..

నేడు జిల్లాలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర

● మూడు రోజుల పాటు జిల్లాలో కొనసాగనున్న యాత్ర

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 28: పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా విజయ సంకల్ప యాత్ర కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించిన విషయం తెలిసిందే. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోకి వచ్చే కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో విజయ సంకల్ప యాత్ర ఇప్పటికే కొనసాగుతుంది. కేంద్ర మంత్రి బీఎస్ వర్మ నేతృత్వంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో విజయ సంకల్పయాత్ర కొనసాగుతుంది. ఈ సంకల్ప యాత్ర గురువారం కామారెడ్డి జిల్లాలోకి ప్రవేశించనుందని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార తెలిపారు. గురువారం సాయంత్రం 4 గంటలకు జుక్కల్ నియోజకవర్గ కేంద్రంలోకి బీజేపీ జిల్లా నేతలు సంకల్ప యాత్రకు స్వాగతం పలకనున్నారు. జుక్కల్ నియోజకవర్గ కేంద్రంలో రోడ్డుషో, పబ్లిక్ మీటింగ్ నిర్వహించనున్నారు. అనంతరం బిచ్కుంద మీదుగా బాన్సువాడలో రోడ్‌షో స్థానికంగానే పబ్లిక్ మీటింగ్ జరగనుంది. బాన్సువాడలో నైట్‌హాల్ నిర్వహించనున్నారు. మార్చి 1న బాన్సువాడలో ప్రెస్‌మీట్ నిర్వహించి ఎల్లారెడ్డి నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది. ఎల్లారెడ్డిలో రోడ్డుషో, పబ్లిక్ మీటింగ్ అనంతరం నాగిరెడ్డిపేటకు యాత్ర సాగనుంది. నాగిరెడ్డిపేట నుంచి లింగంపేట, గాంధారి, సదాశివనగర్, రామారెడ్డి పట్టణ కేంద్రం మీదుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోకి ప్రవేశించనుంది. కామారెడ్డిలో రోడ్డుషో, పబ్లిక్ మీటింగ్ నిర్వహిస్తారు. 2న కామారెడ్డిలో ప్రెస్‌మీట్ నిర్వహించి మాచారెడ్డి వరకు యాత్ర కొనసాగనుంది. మాచారెడ్డి నుంచి సిరిసిల్లలోకి యాత్ర ప్రవేశిస్తుంది.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం

బీర్కూర్, ఫిబ్రవరి 28: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అభయ హస్తం ఆరు గ్యారంటీలలో మరో రెండు గ్యారంటీలను అమలు చేసిన సందర్భంగా బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. పేదలకు భారంగా మారిన కరెంట్ బిల్లులను దృష్టిలో పెట్టుకుని 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్ పథకాలకు సీఎం శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్, జిల్లా కార్యదర్శి కొత్తకపు కాంత్‌రెడ్డి, నాయకులు బసవరాజు పటేల్, చందు తదితరులు పాల్గొన్నారు.


బీర్కూర్‌లో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నసురుల్లాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని నసురుల్లాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయినాల లింగం, తూము సాయాగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అందులో భాగంగా ఇప్పటివరకు 4 హామీలను పూర్తి చేశారు. అందుకు గాను మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పూర్తి చేస్తుందని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు మాజీ సర్పంచ్ విఠల్ గురూజీ అన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, రమేష్, హన్మాండ్లు, పండరి గౌడ్ తదితరులున్నారు.

బాన్సువాడ టౌన్ : పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మాసాని శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నార్ల రత్నకుమార్, తృప్తి నాగరాజు, పాత బాలకృష్ణ, కొత్తకొండ భాస్కర్, కార్యకర్తలు తదితరులున్నారు.


ముత్యంపేట ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ముత్యంపేటలో ఘనంగా చక్కెర తీర్థం

దోమకొండ, ఫిబ్రవరి 28: మండలంలోని ముత్యంపేట గ్రామంలో శ్రీ రేణుకాదేవి 60వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రేణుకా ఎల్లమ్మ ఆలయం ఆవరణలో ఘనంగా చక్కెరతీర్థం(జాతర) జరిగింది. రాత్రి 8 గంటల నుంచి శ్రీ సింగరాయపల్లి అంజయ్య శిష్యుల బృందంచే శ్రీ రేణుకా ఎల్లమ్మ ఒగ్గుకథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో తీగల తిర్మల్‌గౌడ్, నాయిని ప్రభాకర్‌రెడ్డి, అశబోయిన శ్రీనివాస్, కదిరే గోపాల్‌రెడ్డి, సీతారాం మధు, సంతోష్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్తగారి శిరీష్‌గౌడ్, సభ్యులు చిన్నపోశగౌడ్, ఎ. స్వామిగౌడ్ భక్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 28: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో బుధవారం రూ.15లక్షల ఎమ్మెల్యే నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా రోజులుగా ఉన్న రోడ్డు సమస్యను ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నిధులు మంజూరు చేశారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గయాజుద్దీన్, చెన్న లక్ష్మణ్, గురు ప్రతాప్, అజార్ ఖాద్రి, శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: మండలంలోని బంజపల్లి గ్రామంలో సీసీరోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నౌశిలాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడు నెలలు కాకముందే బంజపల్లి గ్రామానికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ రూ.10లక్షల సీసీరోడ్డు పనులను మంజూరు చేయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ్‌కుమార్, భోజ్యానాయక్, కోటి నాయక్, శ్రీనునాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలి

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 28: గృహజ్యోతి పథకం అన్ని ప్రభుత్వ పాఠశాలలకు వర్తింపజేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవరెడ్డి, బూనేకర్ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలన్నింటికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలన్నారు.


పూజలు చేస్తున్న వైస్ ప్రెసిడెంట్ వేణు గోపాల్ రావు

గాయత్రీ షుగర్స్‌లో ముగిసిన క్రషింగ్

నిజాంసాగర్, ఫిబ్రవరి 28: మండలంలోని మాగి గాయత్రీ ఫ్యాక్టరీలో 2023-24 సంవత్సరంకు కొనసాగిన క్రషింగ్ బుధవారం ముగించారు. నవంబర్‌లో ప్రారంభించిన క్రషింగ్‌ను 3.60 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యంతో ప్రారంభించి లక్ష్యానికి మించి 3.62లక్షల మెట్రిక్ టన్నుల చెరుకును క్రషింగ్ చేసినట్లు వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. రైతులకు, అధికారులకు, కార్మికులకు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేన్ మేనేజర్ వెంగళ్‌రెడ్డి, జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి, డీజీఎం శ్రీనాథ్ రెడ్డి, సుగుణ భూషన్ రావు, ప్రభాకర్, భక్తవత్సల రెడ్డి, పీవో గోవింద్ తదితరులున్నారు.

రైతువేదికలో మండల సర్వసభ్య సమావేశం

రాజంపేట, ఫిబ్రవరి 28: రాజంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం మండల సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొని గ్రామాల్లో పలు సమస్యలపై ఎంపీటీసీలు, గ్రామ స్పెషల్ అధికారులు వివరించారు. త్వరలోనే పలు సమస్యలపై చర్యలు తీసుకుంటామని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, తహసీల్దార్ అనిల్, వైస్ ఎంపీపీ సావిత్రి, ఎంపీటీసీలు సాగర్, రాజు, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో ఫిజియోథెరపీ క్యాంప్

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం భవిత సెంటర్‌లో సమగ్ర శిక్ష కామారెడ్డి ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషా మాట్లాడుతూ ఇంటి దగ్గర చేయాల్సిన వ్యాయామాల గురించి తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతీ బుధవారం మండలంలో ఉచిత క్యాంప్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని పరిసర గ్రామాలకు చెందిన 2-14 సంవత్సరాల వయసు గల దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భిక్కనూరులో క్యాలెండర్ ఆవిష్కరణ

భిక్కనూరు, ఫిబ్రవరి 28: భిక్కనూరు మండల కేంద్రంలోని సినిమా టాకీసు చౌరస్తాలో బుధవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆటో యూనియన్ అధ్యక్షుడు బసగల్ల సిద్ధరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల సాధనకు సభ్యులు ఐక్యం ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు సాయినిఖిల్, ప్రతినిధులు రాజేందర్, నాగులు, లింగం, బీమయ్య, ఆంజనేయులు, శ్రీకాంత్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 28: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 46వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ కోయిలకర్ కన్నయ్య కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలతో ఆకర్షితులై పెద్ద ఎత్తున పార్టీలోకి కౌన్సిలర్‌లు, నాయకులు చేరుతున్నారని ఆయన తెలిపారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్ కన్నయ్య

వేతనాలు చెల్లించాలంటూ ఆస్పత్రి ముందు కార్మికుల ధర్నా

బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 28: బాన్సువాడ ప్రభుత్వ ఏరియాస్పత్రి, ఎంసీహెచ్‌లో పని చేస్తున్న కార్మికులకు గత కొన్ని నెలలుగా వేతన బకాయిలు చెల్లించాలంటూ విధులను బహిష్కరించి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రి ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు మాట్లాడుతూ ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్ , సెక్యూరిటీ గార్డులకు సంబంధిత కాంట్రాక్టర్ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. ఇటీవల కార్మికులు వేతన బకాయిలు కోసం ధర్నా చేస్తే త్వరలోనే కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తానని హామి ఇచ్చి, తర్వాత మాట మార్చడంతోనే కార్మికులు మళ్లీ విధులను బహిష్కరించి ధర్నాకు పూనుకున్నట్లు ఆయన తెలిపారు. ధర్నా విషయం తెలుసుకున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ ధర్నా శిబిరానికి విచ్చేసి సంబంధిత కాంట్రాక్టర్, యూనియన్ నాయకులతో మాట్లాడారు. ప్రస్తుతం రెండు నెలల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని సూపరింటెండెంట్ శ్రీనివాస్‌ప్రసాద్ కార్మికులకు లిఖిత పూర్వకమైన హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నాను విరమించి తిరిగి విధుల్లో చేరారు. ఈ కార్యక్రమంలో కమర్‌అలీ, రేణుక, ధనుంజయ్, రాజు, సంగీత, సురేఖ, సరోజ, గంగారాం తదితరులున్నారు.


ఆస్పత్రి ముందు ధర్నా చేస్తున్న కార్మికులు



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	ఊరు పేరు భైరవకోన
ప్రియా 70	ఈగల్
ప్రియా 35	సిద్ధార్థరాయ్

బాన్సువాడ	
మహేశ్వరి	ఊరు పేరు భైరవకోన
వెంకటేశ్వర	హనుమాన్

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

